# లాభసాటి బేరం!

బేరం చెయ్యటంలో ఆడవాళ్ళదే పై చేయి. అందులో రమ మరీను. ఆమె భర్త చలపతిరావుకు బేరం అంటే అసలు గిట్టదు. అందుకనే రమ, ఆయనతో ఎప్పుడూ బజారు వెళ్ళదు. షాపు వాళ్ళు ధర బాగా ఎక్కువ చెపుతారని, గట్టిగా బేరం ఆడితే తగ్గిస్తారని, ఆమె అనుభవంలో తెలుసుకున్న విషయం. పైగా తక్కువ తూస్తారని, వాళ్ళ త్రాసు, తూకంరాళ్ళుకూడా సరిగ్గా వుండవని ఆమె విశ్వాసం. అందుకనే త్రాసు, తూకంరాళ్ళు కొని తెచ్చిపెట్టుకుంది. ఏ మాత్రం అనుమానం తగిలినా, చప్పున తన త్రాసుతో, కొన్న వస్తువులను తూచి, తేడావస్తే, షాపువానితో పోట్లాడి మరీ తెచ్చుకుంటుంది.

ఆనాడు చిత్తుకాగితాలు కొనేవాడు వచ్చాడు. కాస్తంత రమ పరధ్యానంలో వుంటే, చలపతిరావు, తన యింట్లో వున్న చిత్తుకాగితా లన్నింటిని ఏదో ధరకి యిచ్చేసేవాడే సరిగ్గా ఆ మాటలు జరుగుతూవుంటే, రమ ఘుట్టే రివ్వున వరండాలోకి వచ్చేసింది. ఇద్దరూ కాసేపు ఘర్షణపడ్డారు. చివ్వరకు, ఆ చిత్తుకాగితాల అమ్మకాన్ని, రమకు పూర్తిగా వదిలేసి, చలపతిరావు లోపలికి వెళ్ళిపోయాడు.

రమను చూడంగానే ఆ బేరగాడు డిగాలపడిపోయాడు.

"కిలో ఎనభై పైసలయితే తీసుకో, లేకపోతే వెళ్ళిపో..." నిక్కచ్చిగా అనేసింది రమ.

"అమ్మగారు..." అంటూ అతగాడు ఏదో చెప్పబోయాడు.

"ఈ పేపర్ల సంగతి అయ్యగారి కేం తెలుసు. నాతో మాట్లాడు..." అన్నది రమ.

కిలో చివ్వరకు డెబ్భైఅయిదు పైసలకు తీసుకునేటట్లు ఒప్పందం కుదిరింది. ఇక అతను తన సంచీలోనుంచి త్రాసు, తూకంరాళ్లు తీయబోతున్నాడు.

"మొన్ననే కొత్తత్రాసు కొన్నాం.

‘మైత్రేయస”




నీ త్రాసుతో తూస్తే లాభంలేదు. ఇదిగో తెస్తున్నా..." అంటూ రమ లోపలికి వెళ్ళింది.

అతను మరింత కుంగిపోయాడు. బేరంలోనూ లాభంలేకపోయింది. ఇక తూకంలో నష్టాన్ని పూడుద్దామనుకుంటే అదీ లాభంలేకపోయింది. ఏంచేసేటట్టు అని ఆలోచించుకుంటున్నాడు.

హఠాత్తుగా రమ త్రాసు, తూకంరాళ్లు తీసుకువచ్చింది. తానే స్వయంగా కాగితాలు వేస్తూ, తూకం సరిగ్గా వుందో లేదో చూస్తూ, మొత్తంమీద సగర్వంగా అచ్చిత్తుకాగితా లన్నింటిని తూయించేసింది. ఎప్పుడు తన భర్తకు తన చాకచక్యాన్ని చెపుదామా అనే ధ్యాసలోవుంది. గబగబ డబ్బులు తీసుకుని భర్తదగ్గిరకు వచ్చేసింది.

"నిజం చెప్పండి, మీరు ఆ మొత్తం పేపర్లకు యెంత తీసుకుందా మనుకున్నారు..." అన్నది రమ.

"నాకంటే యెక్కువే సంపాదించి వుంటావులే..." అన్నాడు.

"అది ఖాయమే అనుకోండి. ఎంతో చెప్పండి..."

"నాలుగుంబావలా..."

రమ కిలకిల నవ్వింది. చలపతిరావు గిలగిల మన్నాడు.

"ఆరుముప్పావలా వచ్చింది తెలుసా..."అంటూ సగర్వంగా డబ్బును చూపించింది రమ.

ఇక బేరం చెయ్యటాన్ని గురించి, తన గొప్పతనాన్ని గురించి రమ ఏకరువు పెడుతోంది. చలపతిరావు సహనంగా వింటున్నాడు. క్షణంలో యిట్టే తల విదిలించేసి, గభాలున లేచాడు.

"రమా, ఇట్రా...అవునుగాని, మన త్రాసేది..." అన్నాడు. సగంతెరిచిన నోరును అట్టాగే వుంచేసుకుని,

"ఆఁ..." రమ గుండె గుభేలు మన్నది.